# పరపతి

వీరయ్య విపరీతమైన పనిలో మునిగిపోయాడు. తలెత్తకుండా చేసినా పని పూర్తవుతుందా అనిపిస్తోంది. పాస్ చెయ్యాల్సిన బిల్లులు అతని టేబిల్‌మీద కుప్పలా పడి వున్నాయి. డిస్కౌంట్లు, పెనాల్టీలు, డెలివరీ షెడ్యూల్స్ - సప్లయిసు, రేట్ ఎమెండ్‌మెట్సు అంటూ బుర్ర బద్దలు కొట్టుకుంటుంటే ఆఫీసరుగారు పిలుస్తున్నారని కబురొచ్చింది.

"ఇదిగో యిది అర్జెంటు. ఇప్పుడే ఓ అరగంటలో పేమెంటు ఇచ్చెయ్యాలి - వెంటనే పాస్ చెయ్యండి" అంటూ ఆయనొక బిల్లు యిచ్చారు. అదొక ఆయిల్ కంపెనీ బిల్లు. లక్షా యాభై వేలకి పైనే వుంది. అది స్వయంగా తీసుకొచ్చిన రిప్రజెంటేటివ్ కూడా వీరయ్య వెంట వచ్చి అతని సీటు దగ్గర కూర్చున్నాడు.

ఆ ఆయిల్ బిల్లు చూడగానే వీరయ్యకి ఇంట్లో కిరసనాయిల్ లేని విషయం గుర్తుకొచ్చింది. కిరసనాయిల్ వారం రోజులుగా ఊళ్ళో దొరకడం లేదు. రోగిష్టి భార్య కుంపటి పెట్టుకుని పడరాని పాట్లు పడుతోంది. పెట్రోల్, డీసిల్, సప్లయిచేసే ఈ కంపెనీకి కిరసనాయిల్‌తో సంబంధం వుండకపోతుందా? తప్పక వుండే వుంటుంది.

వీరయ్య ఆలోచయన కట్టిపెట్టి బిల్లు పాస్‌చేసి ఆఫీసర్‌గారి సంతకం చేయించి, చెక్కు తయారుచెయ్యమని చెప్పివచ్చి, నెమ్మదిగా ఆ రిప్రజెంటేటివ్‌ని కదిపాడు. అతను మొదటి మాటలోనే యితని భావం గ్రహించి "మీరు ఫలానా డిపోకి రండి. మీకెంత కిరసనాయిల్ కావలసినా యిప్పిస్తాను" అంటూ ఎడ్రస్ రాసిచ్చి, వీరయ్య పేరు

అడిగి అక్కడ చెప్తానని ఎంతో మర్యాదగా చెక్కు తీసుకుని వెళ్ళిపోయాడు.

వీరయ్య ఢిల్లీ సింహాసనం ఎక్కినంత ఆనంద పడిపోయి మర్నాడు సెలవు పెట్టేశాడు.

నీటుగా తయారై పద్దెనిమిది లీటర్లు పట్టే డబ్బా తీసుకుని, ఊరుకి దూరంగా వున్న డిపోకి బయలుదేరాడు.

అక్కడొక పెద్దమనిషి కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు. వీరయ్య వినయంగా వెళ్ళి "మరేమోనండి కిరసనాయిల్" అని మొదలు పెట్టగానే – ఆ పెద్దమనిషి పేపర్లోంచి తలెత్తి చూడకుండానే "స్టాకు లేదండి" అన్నాడు.

రెండు నిమిషాలు నిలబడినా అతను పేపర్లోంచి తలెత్తక పోవటంతో వెనక్కి తిరిగాడు వీరయ్య.

ఒక ఫర్లాంగు దూరం వచ్చి అక్కడొక మైలురాయిమీద కూర్చుని తీవ్రంగా ఆలోచించాడు. అతనెంతో నిజాయితీగా చెప్పాడే! అయినా ఇలా అయింది. అయినా తన మాటే వినిపించుకోలేదు అని యోచిస్తుంటే అతని బుర్రలో తళుక్కున ఒక ఊహ మెదిలింది.

కళ్ళజోడు తీసి జేబులో పెట్టేశాడు. టక్‌చేసిన షర్టు పేంటుమీదకి లాగేసుకున్నాడు. జేబులోంచి దువ్వెన తీసి కుడిపాపిడి తీసి క్రాపు మార్చేసాడు. పేంటు కాస్త పైకి మడిచాడు. జేబులోంచి చిన్న కాగితం తీసి దానిమీద తనపేరు, ఆఫీసు రాసి ముందుకు కదిలాడు.

"ఆఫీసునుండి ఈరయ్యగారు పంపారండి" అంటూ కాగితం ఆయనకిచ్చాడు.

అదిచూసి "ఒరే సుబ్బన్నా – కిరసనాయిలంట పోసి పంపించు" అని మళ్ళీ పేపర్లో తలదూర్చాడాయన.

అయిదు నిమిషాల్లో పని పూర్తిచేసుకుని బయటపడిన వీరయ్య "పరపతి గలవాళ్ళు నౌకర్ని పంపాలిగానీ తనేపోతే పని యెట్లాగౌతుంది?" అనుకుని చకచకా అడుగులు వేశాడు.

●